అమెరికన్ పిస్తోలు

రామూ రాడి అన్నసంగతి ఆబడికీ, ఆగ్రామానికీకూడా తెలుసు. అమ్మ నాన్న తొందర మూలంగా అష్టమతరగతి అతి కష్టంపై మూడోయేడు ముచ్చటగా దాటేశేడు.

అంతటితో ఆచదువుకు ఫుల్ స్టాఫ్ పెట్టి రాజకీయాల్లో ప్రవేశించాలని తీర్మానించుకొన్నాడు. రాజకీయాలు నేర్చుకోవాలంటే వార్తా పత్రికలన్నీ ప్రోగుచేసి చదవటం మొదలెట్టాడు.

ఆలా చదువుతూ పోతూంటే ఓ వార్తా పత్రికలోని "అమెరికన్ మాడల్ పిస్తోలు కొనండి. ధర సరసము. లైసెన్సు అవసరము లేదు" అన్న ప్రకటనఒకటి రామూని ఆకర్షించింది. రాము యోచించాడు. 'మనం యెటూ రాజకీయవాదికాబోతున్నాము గాబట్టి ఓపిస్తోలు అవసరమే' ననుకొన్నాడు. వెంటనే ముక్కానీ కార్డుకొని ఒక పిస్తోలుకు ఆర్డరు వ్రాసి పంపేశాడు. స్నేహితులతోకూడా తాను పిస్తోలు కొనబోతున్నానని సగర్వంగా ప్రకటించుకొన్నాడు.

వారం గడచింది. వి. పి. పి. వచ్చింది. మూడుమ్ముప్పావలా చెల్లించమన్నాడు తపాలా బంట్రోతు. ఎంతో శ్రమపడి డబ్బు లార్జించి మూడుమ్ముప్పావలా చెల్లించి వి. పి. పి. తీసుకొన్నాడు. ఆత్రం కొద్దీ వెంటనే పెట్టె పగులగొట్టాడు. పిస్తోలు నిగనిగా మెరుస్తోంది. రామూ కళ్లు జిగేలుమన్నాయి. వెంటనే స్నేహితుల నలుగురీ్ని పిలిచాడు. కేపులు బిగించి ఓపిట్టను గురిచూసి కొట్టాడు.. పిట్ట యెగిరిపోయింది. శబ్దంమాత్రమే గొప్పగా వచ్చిందికానీ గుండ్లు లేవు. రాము తెల్లమొగం వేశాడు. స్నేహితులంతా గొల్లుననవ్వారు. రామూకు పట్టరాని కోపం వచ్చింది. ఒక్క పరుగుతో పోస్టు బంట్రోతువద్దకు పోయి "యీ తుపాకి నాకొద్ద" న్నాడు. జవాను ఓ నవ్వు నవ్వి

గోపి

"నాకు మాత్రం యెందుకూ? ఆ కంపెనీవాడికే పంపించు" అన్నాడు.

రామూకి కోపం రెట్టింపయింది. దీని నెలాగైనా అమ్మేయా లనుకొన్నాడు. ఎందరితోనో బేరం సాగించాడు. అందరూ వద్దన్నారు. తుదకు బస్తీకి బయలుదేరాడు. రోడ్డునబడి పోతూన్నాడు. అలా పోతూండగా రామూకు ఎదురుగా ఓ ముదుసలి బస్తీలో సరుకులుకొని మూట నెత్తిమీద బెట్టుకొని వస్తూన్నాడు. ఆ తాతను చూడగానే రామూమనస్సులో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. అటూ యిటూ చూశాడు. రోడ్డు మీద మరెవరూ లేరు. రాము గబగబా తాతకి ఎదురుగా వెళ్ళి "ఆగు"అని బిగ్గరగా అరచి పిస్తోలు అతని రొమ్ముకి సూటిగా గురిబెట్టాడు. తాతకూడా జడిసిపోయి నిర్గ్రహంలా నిల్చుండిపోయాడు.

"నీ నెత్తిమీది మూట ఖులా యిచ్చిపోతావా? లేక యీ పిస్తోలుతో కాల్చి చంపమంటావా?" అని గట్టిగా అడిగాడు రాము.

దానికేమి చెప్పాలో తాతకు తోచలేదు. ఇవ్వనంటే పిస్తోలుతో పేల్చేస్తాడనే భీతిమాత్రం ఓ ప్రక్క పీకుతోంది. కానీ యింత చిన్న పిల్లాడికి లొంగిపోతే యెలా గనుకొని ఓ యోచనచేసి "నామూట యిస్తానుగానీ, దాని బదులుగా నీ పిస్తోలు యిస్తావా?" అన్నాడు.

మంచి బేరమే ననుకొని "సరే అలాగే" నన్నాడు రాము. వెంటనే రాము తన పిస్తోలునిచ్చేసి మూట తీసుకొన్నాడు. ముసలి తాత బలే తెలివి ప్రయోగించా మనుకొని "నామూట నాకిస్తావా? కాల్చి పారేయమంటావా?" అన్నాడు.

"అది అమెరికన్ మాడల్ పిస్తోలు" అన్నమాట మరచిపోయి, రామూ కంగారు పడ్డాడు. తాత తాలూకు మూట అక్కడ పారేసి కాళ్లకి బుద్ధిచెప్పి పారిపోయాడు.

ఇలా ముగిసింది అమెరికన్ పిస్తోలుకథ. ★